ప్రజాశక్తి





# ఎంపీ టికెట్లపై నిరాసక్తి

## మాకొద్దంటే..మాకొద్దు

## అటు టిడిపి, ఇటు వైసిపిలోనూ ఇదే తీరు




**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

వచ్చే సార్వత్రిక ఎన్నికలకు పార్లమెంటు స్థానాలకు పిలిచి టిక్కెట్టు ఇస్తామంటే...మాకొద్దంటే..మాకొద్దు అంటూ నిరాసక్తత చూపుతున్నారు. ఇటు అధికార వైసిపిలోనూ అదే పరిస్థితి ఉండగా అటు ప్రతిపక్ష టిడిపిలోనూ అదే తీరు కొనసాగుతోంది. పార్లమెంటు స్థానాలకు పోటీ చేయడానికి నేతలెవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. తమకు అసెంబ్లీ స్థానాలే కావాలంటూ పట్టుబడుతున్నారు. వైసిపి ఇప్పటికే రెండు పార్లమెంటు స్థానాలకు సమన్వయకర్తలను నియమించింది. పెనుకొండ అసెంబ్లీ నుంచి ప్రాతినిధ్యం వహించిన మాజీ మంత్రి శంకర నారాయణను ఇప్పుడు అనంతపురం పార్లమెంటు సమన్వయకర్తగా నియమించారు. ఆయన కూడా అసెంబ్లీ స్థానంపైనే మక్కువతో ఉన్నారు. అయితే ఇప్పటికే ఆయన సిట్టింగు స్థానంలోకి మంత్రి ఉషచరణ్ శ్రీని నియమించారు. ఆమె అక్కడ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కాని ఆయన అనంతపురం పార్లమెంటు కంటే పాత స్థానమైతేనే బాగుంటుందన్న అభిప్రాయంలోనున్నట్టు తెలుస్తోంది. అయితే అధిష్టానం నిర్ణయం తీసుకోవడంతో చివర్లోనైనా మార్పు జరగకపోతుందా అని ఎదురు చూసే పరిస్థితుల్లోనున్నట్టు సమాచారం. ఇక హిందూపురం పార్లమెంట్ స్థానానికి గోరంట్ల మాధవ్ స్థానంలో కర్నాటకకు చెందిన శాంతను ప్రకటించారు. ఆమె కొత్త కావడంతో ఇక్కడ అందరిలో కలసి పనిచేసే ప్రయత్నంలో నున్నట్టు తెలుస్తోంది. ఇక తెలుగుదేశం పార్టీలోనూ ఇద్దరు మాజీ ఎంపీలనే బరిలో దింపే ఆలోచనలో పార్టీ అధిష్టానమున్నట్టు ప్రచారం నడుస్తోంది. అనంతపురం మాజీ పార్లమెంటు సభ్యులు అయిన కాలవ శ్రీనివాసులు 2014 ఎన్నికల్లో రాయదుర్గం అసెంబ్లీకి దిగి గెలుపొందటమే కాకుండా మంత్రి అయ్యారు. 2019 ఎన్నికల్లోనూ ఆయన అక్కడి నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ఇప్పుడు ఆయన్ను తిరిగి అనంతపురం పార్లమెంటుకు పంపించే యోచన చేస్తున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అయితే ఆయన రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని చెబుతుండటం గమనార్హం. ఈ మేరకు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ ప్రకటించారు. ఇక హిందూపురం పార్లమెంటు స్థానానికి బికె.పార్థసారధిని బరిలో దింపే ఆలోచనలో అధిష్టానమున్నట్టు తెలుస్తోంది. అయితే ఆయన పెనుకొండ అసెంబ్లీ టిక్కెట్టు పైనే మొగ్గు చూపుతున్నారు. పార్లమెంటుకు పోటీ చేయడానికి విముఖత వ్యక్తం చేస్తున్నారు. గతంలో నిమ్మలకిష్టప్ప పోటీ చేశారు. ఆయనకు ఈసారి టిక్కెట్టు లేదని అధిష్టానం సంకేతం కూడా ఇచ్చినట్టు తెలుస్తోంది. బికె.పార్థసారధి వద్దంటే ఎవరిని పార్లమెంటు బరిలో దింపుతారన్న చర్చ కూడా నడుస్తోంది. ఏది ఏమైనా రెండు ప్రధాన పార్టీల్లోనూ పార్లమెంటు స్థానాలకు పోటీ చేయడానికి ముఖ్య నేతలెవరూ ముందుకు రావడం లేదు. దీనికి ప్రధాన కారణం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అయితే స్థానికంగా ప్రజలతో మమేకం అయ్యేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పార్లమెంటు స్థానానికి అయితే ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకునే ముందుకెళ్లాల్సి ఉంటుంది. నేరుగా ప్రజలతో మమకం పనిచేయడానికి కొన్ని రకాలైన అడ్డంకులు ఉండే అవకాశాలుండనున్నాయి. అదే విధంగా ప్రభుత్వం ఏర్పడితే మంత్రి కూడా అయ్యే అవకాశముంది. అదే పార్లమెంటుకుపోతే అవేవి ఉండవన్న ఉద్దేశ్యంతోనే సీనియర్ నాయకులెవరూ పార్లమెంటు స్థానంపై ఆసక్తి చూపడం లేదని రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది.

# టిడిపిలో టికెట్ల టెన్షన్



## హైదరాబాద్‌లో నేతల చక్కర్లు

## టికెట్ల ఖరారు నేపథ్యంలో ప్రయత్నాలు ముమ్మరం

## సమయం దగ్గర పడుతుందంటూ ఆందోళన

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

టిడిపి జిల్లా నేతల్లో టెన్షన్ మొదలైంది. వచ్చే వారంలో అభ్యర్థిత్వాలను ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేయనుందన్న ప్రచారం నేపథ్యంలో స్థానాలను పదిలం చేసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటికే నేతలంతా టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చుట్టూ తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో చక్కర్లు కొడుతున్నారు. వారిద్దరు గత రెండు రోజులుగా అక్కడే ఉండటంతో నేతలంతా అక్కడికి బయలుదేరి వెళ్లారు. ఇద్దరు నేతలను కలసి తమ స్థానాలను పదిలం చేసుకునే పనిలోపడ్డారు. వైసిపి ఇప్పటికే ఆరు జాబితాలను విడుదల చేసింది. అనంతపురం ఉమ్మడి జిల్లాకు సంబంధించి కూడా సగం స్థానాలను ఖరారు చేసింది. తక్కిన స్థానాలపైనా కొంత స్పష్టత ఉంది. ఈ నేపథ్యంలో టిడిడి కూడా అభ్యర్థులను ఖరారు చేసే ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలుస్తోంది. అయితే వైసిపి ఈసారి పెద్దఎత్తునే మార్పులు చేపట్టింది. ఇప్పటి వరకు ప్రకటించిన ఏడు అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంటు స్థానాల్లోనూ మార్పులతోనే ప్రకటించింది. ఈ నేపథ్యంలో టిడిపి కూడా కొన్ని మార్పులు చేసే అవకాశాలున్నట్టు ప్రచారం నడుస్తోంది. సీనియర్లుగానున్న స్థానాల్లోనూ మార్పులు చేసే సూచనలు కనిపిస్తుండటంతోనే నేతల్లో టెన్షన్ నెలకొంది. ఇప్పటికే కొంత మంది నేతలకు అటువంటి సంకేతాలను ఇచ్చినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా టిడిపికి జనసేన, బిజెపిలతోనూ పొత్తులు దాదాపు ఖరారు అయినట్లు కనిపిస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒకటి, రెండు స్థానాలు ఆ పార్టీలకు అవకాశం కల్పించే సూచనలున్నాయి. అవి ఏ స్థానాలుంటాయన్న దానిపై కూడా చర్చ నడుస్తోంది. అవిపోనూ ఇతర స్థానాల్లో ఎటువంటి మార్పులుండనున్నాయన్నది తెలియ్సాల్సుంది. అంతేకాకుండా అటు పరిటాల కుటుంబం, ఇటు జెసి కుటుంబం నుంచి రెండు స్థానాలు కోరుతున్నారు. ముందున్న రాప్తాడుతోపాటు ధర్మవరం టిక్కెట్టు తనదేనని శ్రీరామ్ చెబుతున్నారు. మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ప్రస్తుతం బిజెపిలోనున్నప్పటికీ అవకాశం దొరికితే టిడిపిలోకి తిరిగి రావాలని చూస్తున్నారు. లేకపోతే పొత్తుల్లో బిజెపికి కేటాయించిన ఒకేటనన్నట్టుగానున్నారు. ఈ మార్పు జరిగితే శ్రీరామ్‌కు అక్కడ చోటు ఉండవకపోవచ్చు. అయితే ఈ నాలుగేళ్లుగా తానే ఇన్‌ఛార్జిగా ఉన్నాను కాబట్టి ధర్మవరం అభ్యర్థిని తానేని శ్రీరామ్ చెబుతున్నారు. ఇక జెసి కుటుంబం నుంచి తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గాని జెసి అస్మిత్‌రెడ్డి ఉన్నారు. ఆయన స్థానంలో ఎటువంటి మార్పు ఉండే అవకాశాలు కనిపించడం లేదు. అయితే అనంతపురం పార్లమెంటు అభ్యర్థిగా జెసి.పవన్‌కుమార్‌రెడ్డికి తిరిగి అవకాశం లభిస్తుందా లేదా అన్నది చర్చ నడుస్తోంది. వైసిపి కురుబ సామాజిక తరగతికి చెందిన మాజీ మంత్రి శంకరనారాయణను బరిలోకి దింపింది. దానికి అనుగుణంగా టిడిపి కూడా బిసిలకే ప్రాధాన్యతనిస్తే ఎలాగుంటున్న ఆలోచనలోనున్నట్టు సమాచారం. ఆ రకంగా మార్పు చేపడితే జెసి.పవన్‌కుమార్‌రెడ్డికి ఏ రకంగా ప్రాధాన్యత కల్పిస్తారన్న చర్చ కూడా నడుస్తోంది. ఇక సీనియర్లుగానున్న కాలవ, బికె. పార్థసారధిలను పార్లమెంటు అభ్యర్థులుగా మార్చే అవకాశాముందని చెబుతున్నారు. అయితే వారిద్దరూ అందుకు సుముఖంగా లేరు. వీటన్నింటి నేపథ్యంలో టిడిపి సీట్ల సర్దుబాట్లు ఏ రకంగా ఉండనున్నాయన్నది ఆసక్తికరంగా మారింది. ఇవన్నీ కూడా త్వరలో ఖరారయ్యే అకాశం కూడా ఉండటంతో నేతల్లో ఉత్కంఠ నెలకొంది.



పోస్టర్లు విడుదల చేస్తున్న బాలోత్సవ కమిటీ సభ్యులు, తదితరులు

# అనంత బాలోత్సవం - 2024ను జయప్రదం చేద్దాం

## ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

పిల్లల పండుగ అనంత బాలోత్సవం-2024ను జయప్రదం చేద్దామని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. అనంత బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన బాలోత్సవం పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగానే అనంత బాలోత్సవ కమిటీ, ఆర్ట్స్ కళాశాల సంయుక్తంగా ఈ సంవత్సరం కూడా అనంత బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి అనంత బాలోత్సవం చక్కటి వేదికగా నిలిచిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు అత్యధికంగా పాల్గొనేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆర్ట్స్ కళాశాల అధ్యాపకురాలు అరుణశ్రీ మాట్లాడుతూ పిల్లల్లోని నైపుణ్యాలను వెలికితీయడానికి అనంత బాలోత్సవం దోహదపడుతోందన్నారు. ఈ నెల 12, 13, 14 తేదీల్లో మూడు రోజుల పాటు ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానంలో బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంత బాలోత్సవ కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి మాట్లాడుతూ విద్యార్థులు పాల్గొనే ఈవెంట్స్‌లపై రిజిస్ట్రేషన్ చేయించుకున్న మేరకు ఏ రోజుకు ఆరోజే విద్యార్థులు హాజరై తమ కళలను ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సహకరించి ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడు లక్ష్మీకాంత్, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, నాయకులు గీత, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, నాయకులు సోము తదితరులు పాల్గొన్నారు.

# రాయదుర్గం కాంగ్రెస్ టికెట్ కోసం ఐదుగురు దరఖాస్తు

**ప్రజాశక్తి-రాయదుర్గం**

రాయదుర్గం అసెంబ్లీ టికెట్ కోసం కాంగ్రెస్ పార్టీ తరపున ఐదురుగు దరఖాస్తు చేశారు. దరఖాస్తుకు శనివారం ఆఖరి తేదీ కావడంతో శుక్రవారం పలువురు విజయవాడలోని పార్టీ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తులను అందజేశారు. ఇందులో భాగంగా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఊరువాకిలి అనిల్ కుమార్ దరఖాస్తు చేసుకున్నాడు. ఇదివరకూ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కోరి నాగరాజు, గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన మాజీ ఇన్‌ఛార్జి వడ్డే చిన్నప్పయ్య, బొమ్మనహాళ్ మండలం దర్గాహోన్నూర్ గ్రామానికి చెందిన కె.పి వన్నూరుస్వామి, డి.హీరేహాల్ మండలం సిద్ధాపురం గ్రామానికి చెందిన ఉమేష్ దరఖాస్తు చేశారు. కాగా ప్రస్తుత ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి తాను కళ్యాణదుర్గం నుంచి, తన కుటుంబ సభ్యులు, అనుచరులు రాయదుర్గం నుంచి ఎన్నికల బరిలో పోటీలో ఉంటారని స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అయితే కాంగ్రెస్ పార్టీ తరపున టికెట్ కోసం ప్రయత్నిస్తున్నట్లు చేస్తున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో ఆయన ఎక్కడా తన దరఖాస్తులను సమర్పించకపోవడం గమనార్హం.

# ఎఫ్ఎన్ఒ, ఎంఎన్ఒల సమస్యలు పరిష్కరించాలి

## సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్‌కు సిఐటియు నేతల వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

ప్రభుత్వ సర్వజనాసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పని చేస్తున్న ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కోశాధికారి టి.గోపాల్, జిల్లా నాయకులు ముత్తుజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో సర్వజనాసుపత్రి సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం సర్వజనాసుపత్రిలో పని చేస్తున్న ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓ బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. వారికి కనీస ప్రభుత్వం నుంచి అందే సదుపాయాలు అమలు చేయాలన్నారు. ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఈపిఎఫ్ డబ్బులు వారి వ్యక్తిగత ఖాతాలలో జమ కావడం లేదని పరిశీలించి వారికి ఖాతాలో జమ అయ్యేలా చూడాలన్నారు. ఇస్తున్న క్యాజువల్ లీవ్‌లతో పాటు మరికొన్ని అదనంగా సెలువులు ఇవ్వాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వీరికి వచ్చే ఇన్‌సెన్‌టీవ్స్ సక్రమంగా చెల్లించడం లేదన్నారు. వారు చేయాల్సిన పని కాకుండా వేరే పనులు అప్పజెప్పూ పని ఒత్తిడి పెంచుతున్నారని తెలిపారు. చెప్పిన పని చేయకపోతే వేతనాలలో కోతలు పెడుతున్నారని, పై స్థాయి అధికారులు వీరిని అగౌరవపరుస్తున్నారని, ప్రభుత్వం వీరందరినీ తక్షణమే ఔట్సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎన్ఓ, ఎఫ్ఎన్ఓ ల సంఘం అధ్యక్షులు కుమార్, అనిలా, నాయకులు సులోచనమ్మ, ఆరిఫ్, బాషా తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మకంగా 'జగనన్న పాలవెల్లువ'

## జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి



మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్

**ప్రజాశక్తి - బుక్కరాయసముద్రం**

జగనన్న పాలవెల్లువ కార్యక్రమం కింద పాల సేకరణ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం రూరల్ పరిధిలోని రాచానపల్లి, బుక్కరాయసముద్రం మండలంలోని కొర్రపాడు-2 (బోడిగానిదొడ్డి) గ్రామం వద్దనున్న జగనన్న పాలవెల్లువ, మహిళా డైరీ సహకార సంఘాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, జిల్లా పరిషత్ సీఈవో నిదియాదేవి తదితరులు పాల్గొన్నారు. ముందుగా అనంతపురం రూరల్ పరిధిలోని రాచానపల్లి గ్రామం వద్దనున్న జగనన్న పాలవెల్లువ, మహిళా డైరీ సహకార సంఘాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 13, 14 వ తేదీల్లో జగనన్న పాలవెల్లువ కింద పాలసేకరణ చేపట్టడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ఈనెల 13వ తేదీలోపు కేటాయించిన పనులను పూర్తి చేయాలన్నారు. పాల సేకరణకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతిష్టాత్మకంగా పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఎంపిడిఒ, వెటర్నరీ డాక్టర్, రూట్ ఇన్‌ఛార్జి, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్ తదితరులు పాల ఉత్పత్తిదారులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. అమూల్‌కు పాలు పోయడం ద్వారా లీటర్‌కు అయిదు రూపాయలు అదనంగా వచ్చే అవకాశం ఉంటుందని తెలియజేయాలన్నారు. బిఎంసియుకి విద్యుత్ సరఫరా మూడు రోజుల్లోపు అందించాలన్నారు. పాల రవాణాకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పాల సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అనంతరం బుక్కరాయసముద్రం మండలంలోని కొర్రపాడు-2 (బోడిగానిదొడ్డి) గ్రామం వద్దనున్న జగనన్న పాలవెల్లువ, మహిళా డైరీ సహకార సంఘాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేస్తున్నారా అనేది పరిశీలించాలన్నారు. ఈ డైరీ పరిధిలోని ఎఎంసీయూలను తనిఖీ చేయాలని, అక్కడ సిబ్బందికి పాల సేకరణపై శిక్షణ ఇవ్వాలనో అన్నారు. గ్రామాల వారీగా పాల ఉత్పత్తిదారులకు రీఓరింటేషన్ ఇవ్వాలని, పాలు పోయడం ద్వారా వచ్చే లాభాల వివరాలు తెలపాలని చెప్పారు. ఈ విషయమై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. నిర్దేశించిన సమయంలోగా ఎలాంటి పనులు పెండింగ్ ఉంచకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జీ.వెంకటేష్, పశుసంవర్ధక శాఖ జెడి సుబ్రహ్మణ్యం, డిసిఒ ప్రభాకర్ రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, డైరీ మేనేజర్ నారాయణమ్మ, పిఆర్ ఎస్ఈ, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, రాచానపల్లి సర్పంచి ఆంజనేయులు, ఎంపీటీసీ గౌస్, పంచాయతీ సెక్రటరీ రామకృష్ణ, బోడిగానిదొడ్డి ఉప సర్పంచి శ్రీనివాసులు రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపిని గద్దె దింపితేనే దేశానికి రక్ష

## రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

దేశంలో రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతూ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపితేనే దేశానికి రక్ష లభిస్తుందని కార్మిక, కర్షక సంఘాల నేతలు వక్తలు అన్నారు. సిఐటియు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్.నాగేంద్రకుమార్, వై.రాజారెడ్డి అధ్యక్షతన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఫిబ్రవరి 16 న దేశవ్యాప్తంగా రైతు, కార్మిక సంఘాలు చేపట్టిన కార్మికుల సమ్మె-గ్రామీణ బంద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్మికులు రైతుల సమస్యలు పరిష్కరించడంలో మోదీ ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని ఉన్నత న్యాయస్థానాలు తీర్పులు ఇచ్చినప్పటికి కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ఈ మధ్యనే కనీస వేతనం రూ.24 వేలు పెంచినప్పటికి ఎక్కడా కూడా అములు కావడం లేదన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. రైతులకు నష్టదాయకంగా ఉన్న నల్ల చట్టాలు రద్దు చేయాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానంలో లొసుగులు ఉన్నందున విద్యా విధానం రద్దు చేయాలన్నారు. ఆయా సమస్యల సాధనకు ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె-గ్రామీణ బంద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలోరైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జల ఈశ్వరయ్య, ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏసురత్నం, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాల రంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.క్రిష్ణమూర్తి, ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నగర కార్యదర్శి జానకీ, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, ఏఐటియుసి నాయకులు చెన్నప్పయాదవ్, మల్లికార్జున, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పత్తికి రూ.2వేలు బోనస్ ప్రకటించాలి

## ఎపి రైతు సంఘం నాయకులు

**అనంతపురం కలెక్టరేట్** : రైతులు సాగు చేసిన క్వింటా పత్తికి ప్రభుత్వం రూ.2వేల బోనస్‌ను ప్రకటించాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ఖరీఫ్‌లో సుమారు 80వేల ఎకరాల్లో పత్తి సాగైందన్నారు. అయితే వర్షాలు సకాలంలో రాకపోవడంతో పత్తి సాగు విస్తీర్ణం ఇంకా తగ్గిందన్నారు. రెండేళ్ల ముందు పత్తి ధర బాగా ఉండటంతో జిల్లాలో అధిక మంది రైతులు అప్పులు చేసి పత్తి సాగు చేశారన్నారు. అయితే పత్తి దిగుబడి తగ్గడం.. మద్దతు ధర కూడా ఆశించినంత లేకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. దీంతో దళారీలు సిండికేట్ అయ్యి రూ.5వేల నుంచి రూ.6వేలకు మాత్రమే పత్తి కొనుగోలు చేస్తున్నారన్నారు. దీంతో రైతులకు గిట్టుబాటు గాక తీవ్ర నష్టాలను చవిచూశారన్నారు. చేసేదిలేక చాలామంది పత్తి పంటను ఇళ్లల్లోనే నిల్వ చేసుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరికొంతమంది రైతులు అప్పుల భారం పెరిగి ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం గిట్టుబాటు ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న మద్దతు ధర రూ.7,020కి అదనంగా రూ.2వేలు బోనస్ ప్రకటించి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి

## గుత్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు రైతుల ధర్నా



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న రైతులు

**ప్రజాశక్తి-గుత్తి**

నకిలీ జిపి (జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజు)ను సృష్టించి దాదాపు 30 ఎకరాల భూమిని అక్రమంగా ఇతరుల పేరుపై చేసిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట రైతులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు జి.వెంకటకృష్ణ, సి.సూర్యనారాయణ, సాయిప్రసాద్, కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మండలంలోని ఎస్ఎస్.పల్లి రైతులకు చెందిన చెట్నేపల్లిలోని సర్వేనెంబర్ 212-సి, 215-బి, 216-సి/1, 216-డి, 147, 148.సి, 151, ధర్మాపురం 60 సర్వేనెంబర్‌లోలో నకిలీ దస్తావేజులతో అక్రమంగా భూములను ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారన్నారు. తమ పూర్వీకుల ఆస్తిని చెట్నేపల్లి చెందిన ఎం. శ్రీనివాసులు కుమారులు ముప్పగౌని యల్లప్పగౌడ్, ఎం.రాజేంద్రప్రసాద్‌గౌడ్, రామ్మూర్తిగౌడ్ మరో ఇద్దరు సోదరులతో కలిసి నకిలీ పాస్ పుస్తకాలు, తప్పుడు జిపిని సృష్టించి మండలంలోని ఎస్ఎస్.పల్లి, చెట్నేపల్లి, ధర్మాపురం గ్రామాలలోని సుమారు 30 ఎకరాల భూములను రిజిస్ట్రేషన్ చేసుకున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే చేసిన రిజిస్ట్రేషన్లను రద్దుచేసి తమ భూములను తమ పేరు మీదనే రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని సబ్ రిజిస్టర్ తో మొరపెట్టుకున్నారు. ముందుగా అక్రమ రిజిస్ట్రేషన్ పై ఎలాంటి పాస్ పుస్తకాలు ఇవ్వరాదని అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ బారతికి వినతిపత్రం అందజేశారు. ఇందులో భాగంగా సబ్‌రిజిస్ట్రార్ గురునాథ్‌తో రైతులు వాగ్వివాదానికి దిగారు. అనంతరం పోలీస్‌స్టేషన్లో సబ్ రిజిస్ట్రార్ గురునాథ్, డాక్యుమెంట్ రైటర్ సత్యనారాయణపై ఫిర్యాదు చేశారు. అక్రమాలకు పాల్పడ్డ వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో భూములను తమ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయకపోతే రాబోవు కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని రైతులు హెచ్చరించారు.

# పురుగు మందులు, ఎరువులను సిద్ధంగా ఉంచాలి



మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

**నార్పల** : రాబోవు ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన పురుగు మందులు, ఎరువులు, విత్తనాలను రైతు భరోసా కేంద్ర సిబ్బంది సిద్ధంగా ఉంచుకోవాలని జిల్లా వ్యవసాయణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని 1వ రైతు భరోసా కేంద్రంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ నాటికి ఏ మందులు, విత్తనాలు అవసరమో ప్రణాళికను రూపొందించి అందుబాటులో ఉంచాలన్నారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతుల వివరాలను ఈపంటలో నమోదు చేయాలన్నారు. పీఎం కిసాన్ పథకానికి సంబంధించి రైతులను బయోమెట్రిక్ అథెంటికేసన్, ఎన్పీసీఐ లింకు చేయించాలని సూచించారు. ప్రతి రైతు భరోసా కేంద్రం సిబ్బంది 50 మంది రైతులకు సంబంధించి మట్టి నమూనాలను సేకరించి పరీక్ష ఫలితాల కోసం అనంతపురం సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపాలని కోరారు. ఈ కార్యక్రమములో బండ్లపల్లి ఎంపిటిసి శంకర్‌యాదవ్, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు తాడిపత్రి చంగల్‌రాయుడు, నార్పల ఎఒ చెన్నవీరస్వామి, ఉద్యాన శాఖ విస్తరణ అధికారి శ్రీ సాయి చరణ్, వ్యవసాయ విస్తరణ అధికారిణి శైలజ, మండల రైతు భరోసా కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

# చేయూత కోసం చిన్నారి ఎదురుచూపు



**అనంతపురం :** గుండెజబ్బుతో చావుతో పోరాడుతున్న ఆత్మకూరు మండలం వడ్డుపల్లి గ్రామానికి చెందిన చిన్నారి లిఖిత చేయూత కోసం ఎదురు చూస్తోంది. వడ్డుపల్లికి చెందిన పూజారి, రామలక్ష్మి అనే దంపతులు కూలి పని చేసుకుంటూ జీవని సాగిస్తున్నారు. వీరికి నలుగురు కూతుళ్లు. వీరిలో మూడవ అమ్మాయి లిఖిత 6వ తరగతి చదువుతోంది. అయితే విద్యార్థిని కొన్నేళ్లుగా గుండె జబ్బుతో బాధపడుతోంది. వైద్యం కోసం సుమారు రూ.10 లక్షల వరకూ ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల కనీసం స్పెషాలిటీ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోలేని పరిస్థితి. ఈనేపథ్యంలో దాతలు సహకరిస్తే చిన్నారి ప్రాణం బయపడుతుంది. కావున చిన్నారి గుండెకు చేయూత ఇవ్వాలనుకునేవారు సెల్..93812 35503 ద్వారా ఫోన్‌పే చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# కాశిరెడ్డినాయన ఆశ్రమానికి పశువుల తరలింపు

**ప్రజాశక్తి-పెద్దవడుగూరు**

మండలంలోని కాశేపల్లి సమీపంలో కంటైనర్ బోల్తాపడిన ఘటనలో బతికిన పశువులను సీఐ రోషన్, ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం గుత్తిరోడ్డులో ఉన్న కాశిరెడ్డి నాయన ఆశ్రమానికి తరలించారు. కంటైనర్లో 54 పశువులను తరలిస్తుండగా జరిగిన ప్రమాదంలో 29 ఎద్దులు, ఆరు ఆవులు మృతిచెందిన విషయం తెలిసిందే. ప్రమాదం అనంతరం కొన్ని పశువులు ఎటోవెళ్లిపోగా పోలీసులు కనుగొని 14పశువులను పెద్దవడుగూరులోని పశువైద్యశాలకు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ ఒక పశువు మృతిచెందింది. మిగిలిన 13 పశువులను కాశిరెడ్డి నాయన ఆశ్రమానికి తరలించి వాటిబాగోగులు చూసుకోవాలని నిర్వాహకులు బ్రహ్మానందరెడ్డికి సూచించారు. గాయపడిన పశువులకు వైద్యురాలు కమల, సిబ్బంది సత్యనారాయణ చికిత్స నిర్వహించారు. కాగా పశువులను తరలించే ముఠా ఎవరన్నది పోలీసులు కాశేపల్లి, కల్లూరు, గార్లదిన్నె, గుత్తిఅనంతపురం తదితర గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులను పిలిపించి రహస్యంగా విచారణ జరుపుతున్నట్లు సమాచారం.



కాశిరెడ్డినాయన ఆశ్రమంలో ఉన్న పశువులు

# టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

**ప్రజాశక్తి-పామిడి**

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ద్వారానే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జి లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని తన స్వగృహంలో యూనిట్ ఇన్‌ఛార్జిలు, పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రన్నారు. తమకెప్పుడు మంచిరోజులు వస్తాయా.. అని ఎదురు చూసున్నారన్నారు. ఈనేపథ్యంలో కష్టాలు, ఇబ్బందులు పడుతున్న ప్రజలకు భరోసా ఇస్తూ భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో సూపర్ సిక్స్ పథకాలకు చంద్రబాబు శ్రీకారం చుట్టారు. చంద్రన్న పాలన మళ్లీ వస్తేనే తమ జీవితాల్లో వెలుగులు నిండుతాయని ప్రజలు కూడా భావిస్తున్నారన్నారు. బాబు ప్రకటించిన సంక్షేమ పథకాలు ప్రజలను ప్రజలకు వివరించి రిజిస్ట్రేషన్ చేసి చంద్రబాబు ముఖ్యమంత్రిగా, జితేంద్రగౌడ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జింకల రామకృష్ణ, వై.యు.రామాంజనేయులు, బొమ్మ మోహన్‌కృష్ణ, వడ్డే శివకుమార్, అప్పన్నగారి కుమార్, మాధవ, సూరి, శివ, దూదు, రవినాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

## జివిఎస్ఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

**ఉరవకొండ :** గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్‌ను వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి ప్రణయ్‌రెడ్డి శుక్రవారం పట్టణంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల యువజన అధ్యక్షులు ధనరాజ్, రాష్ట్ర నాయకులు రాజేష్, జీవీఎస్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలు పాటించాలి : ఇఆర్ఓ

**ప్రజాశక్తి-రాయదుర్గం**

త్వరలో సార్వత్రిక ఎన్నికల జరగనున్న నేపథ్యంలో అధికారులు, పోలీసులు తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలు పాటించాలని రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం ఎలక్ట్రోరల్ రిజిష్ట్రింగ్ ఆఫీసర్ కరుణకుమారి సూచించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ మీటింగ్ హాలులో పోలీసులు, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే పోలీసులు రాజకీయ నాయకులను కలవరాదని ఆదేశించారు. సహాయ ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు, పోలింగ్ సిబ్బందికి అవసరమైన మౌలిక సౌకర్యాలు ఉన్నాయో.. లేదో.. పరిశీలించాలన్నారు. ఏవైనా ఏర్పాట్లు అవసరమైతే చేపట్టాలన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది, ఇవిఎంలను తీసుకెళ్లే రూట్లను రూట్ ఆఫీసర్లు సెక్టోరల్ ఆఫీసర్లు ఓసారి ప్రయోగపూర్వకంగా వాహనాల్లో వెళ్లి వచ్చేందుకు రెండు గంటల సమయం పడుతుందో లేదో పరిశీలించాలన్నారు. ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలను వివరించారు. కాగా రాయదుర్గం పురపాలక సంఘానికి సంబంధించి సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించాల్సిన రాయదుర్గం మున్సిపల్ కమిషనర్ షేక్ మాలిక్ రాయదుర్గంలో ఉండి సమావేశానికి హాజరుకాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై తాను కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ రాయదుర్గం పట్టణ పరిధిలోనే ఫిర్యాదులు అధికంగా ఉన్నందున, మున్సిపల్ కమిషనర్ సమావేశానికి గైర్హాజర్ కావడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ టిడిపి, ఆమ్ ఆద్మీ పార్టీలకు చెందిన ప్రతినిధులు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. ఈ సమావేశంలో కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు, రాయదుర్గం రూరల్ సీఐ ప్రసాద్ బాబు, రాయదుర్గం తహశీల్దార్ చిట్టిబాబు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సుజాతాదేవి, నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన తహశీల్దార్లు, ఎస్ఐలు, జోనల్ ఆఫీసర్లు సెక్టోరల్ ఆఫీసర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులు, పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఇఆర్ఓ కరుణకుమారి

# నులి పురుగులను నివారిద్దాం

**ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం**

నులిపురుగులను నివారించి చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడుకుందామని ఎంపిపి దాసరి సునీత పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేట్, రెసిడెన్షియల్ పాఠశాలలతోపాటు జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాల, నర్సింగ్ కళాశాల, అంగన్వాడీ సెంటర్లలో పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం సమీపంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపిడిఒ శోభారాణి, డాక్టర్ స్వాతిలక్ష్మి, ఎంఇఒ లింగానాయక్, సిహెచ్ మోహన్‌రావు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య, సూపర్‌వైజర్ నూర్‌బాషా, పీహెచ్ఎం చేన్నమ్మ, ఇఒఆర్‌డి దామోదరమ్మ, హైస్కూల్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు నాగరాజ్‌గౌడ్, ఎస్సీ కాలనీ ప్రధానోపాధ్యాయులు కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**ఉరవకొండ :** జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం విడపనకల్లు మండల పరిధిలోని గడేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉరవకొండ మండల పరిధిలోని రాకెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈకార్యక్రమాల్లో విడపనకల్లు ఎంపిపి కరణ పుష్పావతి భీమ్‌రెడ్డి, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, పెన్నఅహోబిల ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్, వైద్య సిబ్బంది సుగుణ, ఫర్ జహాన్, నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్, హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, స్వర్ణలత, పద్మావతి, భగవాన్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

**బెలుగుప్ప :** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక నులి పురుగుల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సుబ్బరాజు, ఎంఇఒ మల్లారెడ్డి, ఎస్ఓ నాగరత్నాబాయి, ఇఒఆర్‌డి మాధవరెడ్డి, హౌసింగ్ ఎఇ శివారెడ్డి, ఎఎన్ఎం రాధమ్మ, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు

**గార్లదిన్నె :** జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమం డాక్టర్ మంజుల, దిలీప్‌కుమార్, పద్మావతి, ఎఇఒలు తాతాచంద్రనాయక్, వెంకటరమణనాయక్, సీహెచ్ఓ లోకనాథ్, ఆరోగ్య విస్తరణాధికారి నాగేశ్వరయ్య, పిహెచ్ఎన్ అరుణ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎమ్‌లు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**రాయదుర్గం :** గుమ్మగట్ట మండల పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రమేష్, కలుగొడు ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ బాలాజీనాయక్, మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రంలో చిన్నారులకు మాత్రలు వేస్తున్న ఎంపిపి సునీత

## ఎస్పీని కలిసిన అనాథ పాఠశాల పిల్లలు

**అనంతపురం క్రైం :** తాడిపత్రిలోని భగవాన్ రమణ మహర్షి అనాథ పాఠశాల పిల్లలు శుక్రవారం అనంతపురంలో ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్‌ను కలిశారు. ఏడుగురు విద్యార్థులు 750 కిలోమీటర్ల స్కేటింగ్, నాన్‌స్టాప్ రోడ్ రిలే మార్థన్‌ను ఈనెల 12వ తేదీన ప్రారంభించి మూడురోజుల పాటు చేయబోతున్నట్లు పాఠశాల నిర్వాహకులు ఎస్పీకి వివరించారు. స్కేటింగ్‌లో ప్రపంచ రికార్డు సాధించడానికి ప్రయత్నిస్తున్నామని కోచ్ మధు తెలిపారు.

## 11 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

**ఉరవకొండ :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న జనరల్ విద్యార్థులతోపాటు ఒకేషనల్ విద్యార్థులకు ఈనెల 11న ఆదివారం నుంచి ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎన్.మమత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో జనరల్ విద్యార్థులు 183, ఒకేషనల్ మొదటి సంవత్సరం 132, 2వ సంవత్సరం 65 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకూ రోజూ రెండు సెషన్లలో ప్రాక్టికల్స్ జరుగుతాయన్నారు. రెండు ప్రభుత్వ కళాశాలలతోపాటు మహాత్మ జూనియర్ కళాశాల, ముష్టూర్, విడపనకల్, వజ్రకరూరు మోడల్ స్కూల్ విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు.

## పరీక్షల సామగ్రి పంపిణీ

**గుంతకల్లు :** ధర్మవరం ఆత్మీయ ట్రస్టు, యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కెజిబివి పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు ఉచితంగా మోడల్ టెస్ట్ పేపర్లు, బుక్కులు, అట్టలు, పెన్నులు వంటి పరీక్షల సామగ్రిని పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆత్మీయ ట్రస్టు ఛైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి, మండల విద్యాధికారులు మస్తాన్‌రావు, సుబ్బారాయుడు, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, రూరల్ ప్రధాన కార్యదర్శి కల్పన, జిల్లా కౌన్సిలర్ శంకరయ్య, పట్టణ శాఖ ఉపాధ్యక్షులు రమేష్, కార్యదర్శులు సుధాకర్, నిర్మల్‌కుమార్, విశ్వేశ్వరబాబు, ట్రస్టు సభ్యులు ఆదిశేషు, కెజిబివి ప్రిన్సిపల్ మహముదా బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

## 'బటన్ రెడ్డి'ని ఇంటికి పంపేందుకు 'సిద్ధం' : జనసేన

**శింగనమల :** బటన్ నొక్కే సిఎం జగన్‌రెడ్డిని ప్రజలు ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త సాకే మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల కమిటీ అధ్యక్షులు తోట ఓబులేసు ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనను ఎండగడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టిడిపి ప్రభుత్వం ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి చొప్ప చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శులు దివ్య కృష్ణమూర్తి, విజయలక్ష్మి, వీర మహిళలు నాగశేషమ్మ, నాగరత్న, నాయకులు పెద్దిరాజు, తోట ప్రవీణ్, తోట రామ్మోహన్, సాయిశంకర్, మధుశేఖర్, శేఖర్‌బాబు, తోట మధు, నరేంద్ర, బాబు, తదితరులు పాల్గొన్నారు.

## నరసాపురంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

**పెద్దపప్పూరు :** మండలంలోని నరసాపురం గ్రామంలో శుక్రవారం 'బాబు షూరిటీ-భవిషత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జెసి అస్మిత్‌రెడ్డి హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. అంతేగాకుండా టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి జనసేన సమన్వయకర్త కదిరి శ్రీకాంత్‌రెడ్డి, టిడిపి నాయకులు రామకృష్ణారెడ్డి, శశిధర్‌రెడ్డి, యువ నాయకులు లోకనాథ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

**బెలుగుప్ప :** త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో భాగంగా మండల పరిధిలోని నక్కలపల్లి, శ్రీరంగాపురం, బూదివర్తి, ఎన్.గుండ్లపల్లి, ప్రభునేపల్లి, నరసాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ హరినాథ్‌రావు, ఎంపిడిఒ సుబ్బరాజు శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల తదితర ఏర్పాట్లను పరిశీలించి స్థానిక సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ హుస్సేన్‌పీరా, ఇఒఆర్‌డి మాధవరెడ్డి, వీఆర్వో హనుమంతురావు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిబంధనలు పాటించాలి : ఎస్ఐ గౌస్

**గార్లదిన్నె:** వాహనదారుల రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని ఎస్ఐ గౌస్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో యువలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏమైనా జరిగితే కుటుంబ సభ్యులు తీవ్రంగా ఆవేదన చెందుతారన్నారు. కావున ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ గురుమూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మిరప కోతలో జాగ్రత్తలు తీసుకోవాలి

**ఉరవకొండ :** మిరప కోత, తర్వాత రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పంట పండించటంపైనే కాదు.. పంట చేతికొచ్చిన తర్వాత కొన్ని యాజమాన్య మెళకువలను పాటించటం ద్వారా ఉత్పత్తులకు మార్కెట్లో మంచి ధర దక్కి, సాగు లాభసాటిగా ఉంటుందన్నారు. ముఖ్యంగా ప్రధాన వాణిజ్య పంటల్లో ఒకటైన మిరప కోతలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో అధిక ధర పొందాలంటే కోతల అనంతరం మెళకువలు పాటించాలన్నారు. కోతకు ముందు కనీసం 15-20 రోజుల ముందు ఎలాంటి పురుగు మందులు, తెగుళ్ల మందులు, రసాయనాలు పిచికారీ చేయరాదన్నారు. కోతకు ముందు పంటకు నీటి తడులివ్వరాదున్నారు.

## సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే ధ్యేయం

**ఉరవకొండ :** పేదలందరినీ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వి.కొత్తకోట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదల ఇళ్ల వద్దకే మెరుగైన వైద్యసేవలు తీసుకొచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అలాగే వైద్య శిబిరానికి హాజరైన ప్రతి ఒక్కరూ వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రాజేందర్, రాజేష్, శైలజ, పంచాయతీ సెక్రటరీ మహబూబ్‌బాషా, సచివాలయ కన్వీనర్ సింగాడి వీరప్ప, సచివాలయ, వైద్యసిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

## 'పాలవెల్లువ'పై తూతూమంత్రంగా సమీక్ష

**ఆత్మకూరు :** మండలం కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో పాలవెల్లువ కార్యక్రమంపై శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశం తూతూమంత్రంగా సాగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే సమావేశం జరుగుతున్నట్లు కనీసం ఒక రోజు ముందు పత్రికా ప్రకటనలుగానీ, సమాచారం అందజేయకపోవడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎపిఎం నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరిగిందని సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పకడ్బందీగా సమావేశాలు నిర్వహించి పథకాలపై అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



# ఎన్నికల్లో పారదర్శకంగా పని చేద్దాం : ఎస్పీ

**ప్రజాశక్తి -అనంతపురం క్రైం**

త్వరలో రానున్న ఎన్నికల్లో అన్ని ప్రభుత్వ విభాగాలు కలిసి సమిష్టిగా, పారదర్శకంగా పని చేద్దామని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ ఇతర ప్రభుత్వ విభాగాలతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఇప్పటి నుండే ఆయా విభాగాలకు కేటాయించిన మేరకు పని చేద్దామన్నారు. ఈసమావేశంలో సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ, ఎఫ్ఆర్ఓ శ్రీనివాసులు, ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, లీడ్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ మురళీధర్, ఆదాయ పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి, సెంట్రల్, రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్లు అనిత, సోనియతారా, ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజా, డీసీఆర్బీ సి.ఐ విశ్వనాథచౌదరి, సైబర్ విభాగం సి.ఐ షేక్ జాకీర్, ఎస్బిఐ, యూనియన్, కెనరా, ఐడిబిఐ విభాగాల అధికారులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

# శభాష్ విజయ్..94సార్లు రక్తదానం

**ప్రజాశక్తి-పామిడి**

మండల కేంద్రానికి చెందిన బొందలదిన్నె పీటర్ విజయ్ తన 44ఏళ్ల వయస్సులో దాదాపు 94సార్లు రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఇందులో భాగంగానే శుక్రవారం సత్యసాయి జిల్లా బత్తలపల్లి ఆర్‌డిటి ఆసుపత్రిలో రోగి వరలక్ష్మికి 'బి' పాజిటివ్ రక్తం అవసరం కాగా అబ్దుల్ కలాం స్వచ్ఛంద సేవా సంస్థ విజయ్‌ను సంప్రదించింది. వెంటనే స్పందించిన విజయ్ ఆసుపత్రికి వెళ్లి రక్త దానం చేశాడు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ 19ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ గర్భిణికి రక్తం అందక మరణించిందన్నారు. ఈ ఘటన అప్పట్లో తనను కలిచివేచిందన్నారు. అప్పటి నుంచి తనకు తెలిసి ఎవరూ రక్తం అందక చనిపోకూడదని భావించి తనకు తెలిసిన వెంటనే వెళ్లి రక్తదానం చేస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా తన 19 ఏట నుంచే రక్తదానం చేయడం ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికి 94సార్లు రక్తదానం చేసినట్లు వివరించారు. తనతోపాటు అబ్దుల్ కలాం స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఇప్పటివరకు 2,16,000 మందికి రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు, 18,631 మందికి రక్తం ఇప్పించామన్నారు. కరోనా సమయంలో కూడా కరోనాతో చనిపోయిన 63 మందికి అంత్యక్రియలు చేశామన్నారు. విజయ్ చేస్తున్న సేవలను పలువురు ప్రశంసిస్తున్నారు.



రక్తదానం చేస్తున్న విజయ్

# త్వరలో పంటనష్ట పరిహారం : ఎడిఎ

**ప్రజాశక్తి-అనంతపురం**

ఈనెలాఖరులోపు రాష్ట్ర ప్రభుత్వం పంటనష్ట పరిహారం విడుదల చేస్తుందని అనంతపురం వ్యవసాయ డివిజన్ ఎడిఎ ఎం.రవి తెలిపారు. శుక్రవారం స్థానిక అనంతపురం రూరల్ మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండలస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలి సూచించారు. గతేడాది పంట నష్టపోయిన రైతుల జాబితాను ప్రభుత్వానికి పంపామన్నారు. ఈ నివేదికల ఆధారంగా ఈనెలాఖరులోపు పంట నష్ట పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. ఉద్యానవన అధికారి రత్నకుమార్ మాట్లాడుతూ ఫారాంపాండ్స్ కావాల్సిన రైతులు తమ పరిధిలోని ఆర్‌బికెల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే ఉద్యాన శాఖ ద్వారా మినీ ట్రాక్టర్లను సబ్సిడీతో అందజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సభ్యులు, వ్యవసాయ విస్తరణ అధికారులు అలేఖ్య, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎడిఎ ఎం.రవి

## 11న ఘంటసాల అవార్డుల ప్రదానం

**అనంతపురం కలెక్టరేట్ :** పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి ఆధ్వర్యంలో ఈనెల 11న నగరంలోని లలితకళాపరిషత్‌లో నిర్వహిస్తున్నట్లు ఘంటసాల సంగీత కళాభారతి అధ్యక్షులు సుగుమంచి సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి విఎంపి నాయుడులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఘంటసాల గాయకులు కాకినాడ పివి.రమణ అవార్డుకు ఎంపికయ్యారని, వారికి అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు. ప్రజలు హాజరై అవార్డుల ప్రదానోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

## పొత్తుల కోసం 'బాబు' వెంపర్లాట

**అనంతపురం :** వైసిపిని ఒంటరిగా ఎదుర్కొనే ధైర్యం లేక టిడిపి అధినేత చంద్రబాబు పొత్తుల కోసం వెంపర్లాడుతున్నాడని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని 48వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైసిపి' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన 40 ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేశానని చెప్పుకునే చంద్రబాబుకు ప్రజాక్షేత్రంలో వైసీపీని ఎదుర్కొనే ధైర్యం లేదన్నారు. ఇందుకోసమే ఢిల్లీకి వెళ్లి పొత్తుల కోసం వెంపర్లాడుతున్నాడని విమర్శించారు. టిడిపి, బిజెపి, జనసేన పార్టీలు విడిగా పోటీ చేస్తే డిపాజిట్లు కూడా దక్కవన్నారు. అయినా ఎంత మంది కలిసి వచ్చినా వైసిపి ఒంటరి పోరే చేసి గెలుపొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేనకు ఇవే చివరి ఎన్నికలు అన్నారు.

## ఎంపీగా అవకాశమివ్వాలని 'పోతుల' దరఖాస్తు

**అనంతపురం :** అనంతపురం పార్లమెంట్ అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని పోతుల నాగరాజు కోరారు. ఈమేరకు శుక్రవారం విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో తన దరఖాస్తు, బయోడేటా ఫారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 1994 నుంచి ప్రజాసమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తున్నానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీపడే ప్రసక్తే లేదన్నారు. కావున అనంతపురం పార్లమెంట్ అభ్యర్థిగా, లేకుంటే రాప్తాడు అసెంబ్లీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని కోరారు.

## ఎంటెక్ ఫలితాలు విడుదల

**అనంతపురం :** అనంతపురం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంటెక్ 3వ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ ఫతాలను శుక్రవారం విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వి.సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం కళాశాల అకాడిమిక్ సెక్షన్‌లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, డిప్యూటీ కంట్రోలర్ అఫ్ ఎక్జామినేషన్స్ డి.విష్ణువర్ధన్, విభాగాల అధిపతులు కె.ఎఫ్.భారతి, ఎం.రామశేఖరరెడ్డి, దిలీప్‌కుమార్, జి.మమత, అజిత, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు సడలించాలని వినతి

**అనంతపురం :** ప్రస్తుతం ప్రభుత్వ అమలు చేస్తున్న నిబంధనల ప్రకారం ల్యాబ్‌లను నడపలేమని, నిబధనలను సవరించేందుకు సహకరించాలని జిల్లా ప్రయివేట్ ల్యాబ్ టెక్నీషియన్, ఓనర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం నగరంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన నిబంధనలను పాటించి ల్యాబ్‌లను నడపలేమన్నారు. పక్క రాష్ట్రాల నిబంధనలను మన రాష్ట్రంలో కూడా కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమములో డిస్ట్ ప్రెసిడెంట్ విల్సన్, వైస్ ప్రెసిడెంట్ రామమోహన్‌రెడ్డి, సభ్యులు నాగేంద్ర, చంద్రన్న, ధనుంజయ, బాషా, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన

**అనంతపురం కార్పొరేషన్ :** నగరంలోని హమాలీకాలనీ, అశోక్‌నగర్, విద్యుత్ నగర్ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి పనులను కమిషనర్ మేఘస్వరూప్ శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా వర్క్ ఆర్డర్ ప్రకారం పనులు చేశారా..లేదా.. అని కొలతలు తీశారు. పనులు జరిగే సమయంలో ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో ఉండి పనులు చేయించాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు లోపిస్తే రికవరీ చేయిస్తామని హెచ్చరించారు. క్వాలిటీ కంట్రోల్ నివేదికను తప్పనిసరిగా చూస్తామన్నారు. అలాగే బిల్లు చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఇఇ సుధారాణిని ఆదేశించారు.

**ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి**

పేదలందరికీ ఇళ్లు పథకానికి సంబంధించి ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని 36వ సచివాలయాన్ని కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్‌లో ఏమైనా సమస్యలుంటే అధికారులకు దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి వార్డు కార్యదర్శి నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధారాణి, అసిస్టెంట్ ఇంజనీర్ బాబావలి, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు కొలతలు వేస్తున్న అధికారులు

## నిందితుల అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సిఐ

**ఉరవకొండ :** వ్యక్తి అనుమానాస్పద మృతి కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు ఉరవకొండ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిందులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఉరవకొండ రూరల్ సర్కిల్ పరిధిలో ఈనెల 16న సాయంత్రం విడపనకల్ మండలం, హావళిగి గ్రామ పొలాల్లో భూమా హనుమంతు (39) అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం తెలిసిందే. అక్రమ సంబంధం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు సిఐ తెలిపారు. ఈమేరకు నిందుతులు దుర్గమ్మ, ఎదురింటి రామన్నను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.